క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక


ఎస్.సుహాన


బి.గురువెంకటలక్ష్మి


మహీన్


వెన్నెల


ఎం.శరణ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్ 8వ తరగతి విద్యార్థినులు 10 మంది నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్ షిప్‌లకు ఎంపికయ్యారు. వై.నాగజయదీప్తి, ఎం.శరణ్య, బి.గురువెంకటలక్ష్మి, ఎస్.సుహానా, కె.శివగాయత్రి, మహీన్, వెన్నెల, అక్షయ, ప్రియదర్శిని, సలోనిలు ఈ స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాదరెడ్డి తెలిపారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్ పూర్తయ్యేంత వరకు ఉపకారవేతనంగా అందించనున్నారు. ఈ విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడితోపాటు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పోరుమామిళ్ల : ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అంటూ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పీఆర్ ఆర్డీ రాష్ట్ర అడ్వయిజర్ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు చంద్రబాబు హామీలు నమ్మి ఏకపక్షంగా ఓట్లు వేశారన్నారు. ముఖ్యమంత్రిగా జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలపై గతంలో చంద్రబాబు విమర్శించారని, ఆంధ్ర మరో శ్రీలంక అవుతుందని చెప్పారన్నారు. జగనన్న పథకాలకే 72 వేల లక్షల కోట్లు ఖర్చు కాగా ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి లక్షా 20 వేల కోట్ల నుంచి లక్షా యాభై వేల కోట్లు కావాలన్నారు. అప్పుడే శ్రీలంక అవుతుందని చెప్పిన బాబు ఇపుడు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

రైల్వేకోడూరులో జనసేన జయభేరి


అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె : రైల్వే కోడూరు ఎమ్మెల్యేగా జనసేన పార్టీకి చెందిన అరవ శ్రీధర్ 11,101 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మంగళవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో నియోజకవర్గ వ్యాప్తంగా 153805 ఓట్లు పోలవగా అందులో ఈవీఎంలు ద్వారా 152366 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1439 ఓట్లు పోలయ్యాయి. ఇందులో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు ఈవీఎంలు ద్వారా 77,701, పోస్టల్ బ్యాలెట్ 893 మొత్తం 78.,594 ఓట్లు వచ్చాయి. 51.1 శాతం ఓట్లు జనసేనకు పడ్డాయి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులకు 67,002 ఈవీఎంలు ద్వారా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 491, మొత్తం 67,493 ఓట్లు వచ్చాయి. 48.88శాతం ఓట్లు సాధించారు. దీంతో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ 11,101 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

జమ్మలమడుగులో 'ఆది' గెలుపు


ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు : నియోజకవర్గంలో కూటమి విజయం సాధించింది. జమ్మలమడుగు నియోజకవర్గంలో పెద్దముడియం, ఎర్రగుంట్ల మండలాల్లో వైఎస్సార్‌సీపీకి స్వల్ప మెజార్టీ రాగా, మైలవరం జమ్మలమడుగు, కొండాపురం, ముద్దనూరు మండలాల్లో కూటమి అభ్యర్థిగా బీజేపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడిన ఆదినారాయణరెడ్డి మెజార్టీ సాధించారు. మొదటి మూడు రౌండ్ల వరకు వైఎస్సార్‌సీపీ మెజార్టీ సాధించగా మిగిలిన రౌండ్‌లలో కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ప్రభావం చూపుతూవచ్చారు. మొత్తం 23 రౌండ్లు పూర్తయ్యే సరికి పోస్టల్ బ్యాలెట్‌లతో కలిసి 17వేలకు పైగా ఓట్ల మెజర్టీ సాధించారు.

నాలుగో సారి ఎమ్మెల్యేగా..

2004లో మొదటి సారిగా ఎమ్మెల్యే అభ్యర్థి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి 20వేల మెజార్టీ సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అనంతరం 2009, 2014 ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీజేపీలో చేరి 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేసి 17వేల పైచిలుకు ఓట్లతో గెలిచి నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలిచారు.

కమలాపురంలో..

వల్లూరు : కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పుత్తా కృష్ణచైతన్యరెడ్డి విజయం సాధించారు. కడపలోని మౌలానా అజాద్ ఉర్దూ యూనివర్శిటీలో మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌తో పాటు 18 రౌండ్లలో జరిగిన కౌంటింగ్‌లో ఆయన తన సమీప వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డిపై 25,357 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

బద్వేలులో వైఎస్సార్‌సీపీ జయకేతనం

- రెండు రౌండ్లు మినహా ప్రతి రౌండ్‌లో ఆధిక్యత చాటిన డాక్టర్ సుధ
- బద్వేలులో వైఎస్సార్‌సీపీకి వరుసగా నాల్గవ విజయం


ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

బద్వేలు అర్బన్/ అట్లూరు : బద్వేలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసింది. ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ సుధ 18567 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైన తొలి రౌండ్ నుంచే ఆధిక్యత సాధిస్తూ వచ్చారు. మొత్తంగా రెండు రౌండ్లు మినహా 18 రౌండ్లలో ఆధిక్యత కనబరిచారు. మొదటి రౌండ్‌లో డాక్టర్ సుధకు 4562 ఓట్లు లభించగా కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్నకు 3079 ఓట్లు లభించాయి. రెండవ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4535 ఓట్లు లభించగా బొజ్జా రోశన్నకు 3041 ఓట్లు, మూడవ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4689 ఓట్లు లభించగా బొజ్జారోశన్నకు 3355 ఓట్లు, నాల్గవ రౌండ్‌లో డాక్టర్ సుధకు 3526 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3319 ఓట్లు, 5వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4404 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3617 ఓట్లు, 6వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5080 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3956 ఓట్లు, 7వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5044 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3457 ఓట్లు, 8వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5143 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3338 ఓట్లు, 9వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5271 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3847 ఓట్లు, 10వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4296 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3324 ఓట్లు, 11వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4301 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3410 ఓట్లు, 12వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 3846 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 4221 ఓట్లు, 13వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4961 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 5372 ఓట్లు, 14వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 3858 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3567 ఓట్లు, 15వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4764 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3201 ఓట్లు, 16వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4717 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3613 ఓట్లు, 17వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4843 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3698 ఓట్లు, 18వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 4022 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3516 ఓట్లు, 19వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 5556 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 3776 ఓట్లు, 20వ రౌండ్‌లో డాక్టర్ సుధకు 1953 ఓట్లు కాగా బొజ్జారోశన్నకు 1293 ఓట్లు లభించాయి. అలాగే పోస్టల్ బ్యాలెట్‌లో డాక్టర్ సుధకు 1039 ఓట్లు రాగా బొజ్జారోశన్నకు 1843 ఓట్లు లభించాయి. దీంతో డాక్టర్ సుధకు మొత్తంగా 90,410 ఓట్లు లభించగా బొజ్జారోశన్నకు 71,843 ఓట్లు లభించాయి. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.డి.విజయజ్యోతికి 245 పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలుపుకొని 7366 ఓట్లు లభించాయి. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 3169 ఓట్లు నోటాకు పడగా 290 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు.

వరుసగా నాల్గవ విజయం

బద్వేలు శాసనసభ స్థానానికి తొలిసారిగా 1955లో ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు 18 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తర్వాత బద్వేలు అసెంబ్లీ స్థానానికి 2014లో నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జయరాములు టీడీపీ అభ్యర్థి విజయజ్యోతిపై 9502 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దివంగత డాక్టర్ వెంకటసుబ్బయ్య టీడీపీ అభ్యర్థి ఓబులాపురం రాజశేఖర్‌పై 44734 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వెంకటసుబ్బయ్య మరణానంతరం 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సుధ బీజేపీ అభ్యర్థి సురేష్‌పై 90533 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. బద్వేలు ఎన్నికల చరిత్రలో ఇదే అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. తాజాగా జరిగిన ఎన్నికల్లో కూడా డాక్టర్ సుధ కూటమి అభ్యర్థి బొజ్జారోశన్నపై 18567 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో బద్వేలు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి వరుసగా నాల్గవ విజయం దక్కినట్లయింది. అంతకు ముందు 2004, 2009 ఎన్నికల్లో కూడా డీసీ గోవిందరెడ్డి, పీ.ఎం.కమలమ్మలు కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించారు. దీంతో బద్వేలు నియోజకవర్గంలో గోవిందరెడ్డి సారధ్యంలో వరుసగా 6 ఎన్నికల్లో గోవిందరెడ్డి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. ఇదే సమయంలో ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉన్న బద్వేలులో 20 ఏళ్లుగా ఆ పార్టీకి విజయం దక్కకపోవడం గమనార్హం.

కడప ఎమ్మెల్యేగా మాధవీరెడ్డి..

కడప కార్పొరేషన్ : కడప శాసనసభకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి చెందిన ఎస్‌బి అంజద్‌బాషాపై ఆమె 18,860 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దాదాపు ప్రతి రౌండ్‌లోనూ ఆమె ఆధిక్యం కనబరిచారు. కడప రిటర్నింగ్ అధికారి మధుసూదన్ ఆమెకు డిక్లరేషన్ ఫారం అందజేశారు. కడప అసెంబ్లీ పరిధిలో మొత్తం 1,85,136 ఓట్లు పోలవగా, రెడ్డెప్పగారి మాధవికి 90,988 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్‌బి అంజద్‌బాషాకు 72,128 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ 24,500 ఓట్లు సాధించారు.

ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డి విజయం

టీడీపీ 22,744 ఓట్ల మెజారిటీతో గెలుపు


ఆర్ఓ కౌసర్‌బాను నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిపై విజయం సాధించారు. మంగళవారం కడపలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరిగింది. ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానానికి మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,47,966 ఉండగా 1,99,544 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డికి 1,06,712 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాచమల్లు శివప్రసాదరెడ్డికి 83,968 ఓట్లు వచ్చాయి. 22,744 ఓట్ల మెజారిటీతో వరదరాజులరెడ్డి గెలుపొందారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి పీఎండీ నజీర్‌కు 6,016 ఓట్లు వచ్చాయి. మొత్తం 20 రౌండ్లకు గాను కేవలం 3 రౌండ్లలో మాత్రమే రాచమల్లు శివప్రసాదరెడ్డికి మెజారిటీ రాగా మిగతా 17 రౌండ్లలో టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డికి మెజారిటీ ఓట్లు లభిచాయి. ఒకటో రౌండ్‌లో టీడీపీకి 3852, వైఎస్సార్‌సీపీకి 4323, రెండో రౌండ్‌లో టీడీపీకి 5679, వైఎస్సార్‌సీపీకి 4932, మూడో రౌండ్‌లో టీడీపీకి 5254, వైఎస్సార్‌సీపీకి 4960, నాలుగో రౌండ్‌లో టీడీపీకి 5654, వైఎస్సార్‌సీపీకి 4223, ఐదో రౌండ్‌లో టీడీపీకి 5506, వైఎస్సార్‌సీపీకి 3562, ఆరో రౌండ్‌లో టీడీపీకి 5054, వైఎస్సార్‌సీపీకి 4956, ఏడో రౌండ్‌లో టీడీపీకి 5471, వైఎస్సార్‌సీపీకి 3329, ఎనిమిదో రౌండ్‌లో టీడీపీకి 6652, వైఎస్సార్‌సీపీకి 2739, తొమ్మిదో రౌండ్‌లో టీడీపీకి 7041, వైఎస్సార్‌సీపీకి 3334, పదో రౌండ్‌లో టీడీపీకి 4852, వైఎస్సార్‌సీపీకి 4411, 11వ రౌండ్‌లో టీడీపీకి 5471, వైఎస్సార్‌సీపీకి 5257, 12వ రౌండ్‌లో టీడీపీకి 4032, వైఎస్సార్‌సీపీకి 4255, 13వ రౌండ్‌లో టీడీపీకి 6115, వైఎస్సార్‌సీపీకి 3976, 14వ రౌండ్‌లో టీడీపీకి 5412, వైఎస్సార్‌సీపీకి 4175, 15వ రౌండ్‌లో టీడీపీకి 4563, వైఎస్సార్‌సీపీకి 4107, 16వ రౌండ్‌లో టీడీపీకి 6785, వైఎస్సార్‌సీపీకి 4869, 17వ రౌండ్‌లో టీడీపీకి 5834, వైఎస్సార్‌సీపీకి 5025, 18వ రౌండ్‌లో టీడీపీకి 4917, వైఎస్సార్‌సీపీకి 5040, 19వ టీడీపీకి 5629, వైఎస్సార్‌సీపీకి 5004, 20వ రౌండ్‌లో టీడీపీకి 492, వైఎస్సార్‌సీపీకి 442 ఓట్లు వచ్చాయి. పోస్టల్ ఓట్లకు సంబంధించి టీడీపీకి 2440, వైఎస్సార్‌సీపీకి 1049 ఓట్లు లభించాయి. మొత్తం 2,01,284 పోల్ కాగా అందులో 3578 పోస్టల్ ఓట్లు, తిరస్కరించిన ఓట్లు 93 ఉన్నాయి. గెలిచిన అనంతరం వరదరాజులరెడ్డి కడప కౌంటింగ్ హాల్‌లో ఆర్ఓ కౌసర్ బాను చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఓతోపాటు ఎన్నికల పరిశీలకుడు బానుదాస్ పాల్వే, మాజీ జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, చిన్నశెట్టిపల్లె సూర్యనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వరదరాజులరెడ్డిని కొత్తపల్లె సర్కిల్ నుంచి నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయం వరకు ఊరేగించారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నా టీడీపీ నేతలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

మైదుకూరు శాసనసభ్యునిగా పుట్టా గెలుపు

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఆధిక్యత


రిటర్నింగ్ అధికారి నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు : మైదుకూరు శాసనసభ్యునిగా టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపొందారు. నియోజకవర్గ కేంద్రం మైదుకూరు మండలంలో టీడీపీకి భారీ మెజారిటీ వచ్చింది. మైదుకూరు మండలంలో 64,323 ఓట్లకు గాను 54,621 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పుట్టా సుధాకర్ యాదవ్‌కు 32,346 ఓట్లు రాగా, రఘురామిరెడ్డికి 19,358 ఓట్లు వచ్చాయి. ఈ మండలంలో పుట్టాకు 12,988 ఓట్ల మెజారిటీ రావడంతో రఘురామిరెడ్డి విజయ అవకాశాలు దెబ్బతిన్నాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నో ఆశలు పెట్టుకున్న రఘురామిరెడ్డి సొంత మండలం చాపాడులో తక్కువ మెజారిటీ రావడంతో గెలుపు ఆశనిపాతమైంది. చాపాడు మండలంలో 32,441 ఓట్లకు గాను 28,682 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పుట్టా సుధాకర్ యాదవ్‌కు 13,621 ఓట్లు రాగా, రఘురామిరెడ్డికి 13,705 ఓట్లు రావడంతో వైఎస్సార్‌సీపీకి కేవలం 84 ఓట్ల మెజారిటీ మాత్రమే దక్కింది. పోలింగ్ అనంతరం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మైదుకూరు మండలంలో టీడీపీకి అత్యధికంగా 6 వేల ఓట్ల మెజారిటీ వస్తుందని అందరూ భావించారు. అయితే ఊహించని విధంగా సుమారు 13 వేల ఓట్ల మెజారిటీ రావడంతో పుట్టా విజయ అవకాశాలు పెరిగాయి. రఘురామిరెడ్డి సొంత మండలంలో వైఎస్సార్‌సీపీకి కనీసం 5 వేల ఓట్ల మెజారిటీ వస్తుందని అనుకున్నా.. 84 ఓట్ల మెజారిటీ మాత్రమే రావడం ఆయన ఓటమికి కారణంగా మారిందని చెప్పవచ్చు.

పోలైన ఓట్లు, అభ్యర్థులకు లభించిన ఓట్లు, మెజారిటీ వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	టీడీపీ	వైఎస్సార్‌సీపీ	ఆధిక్యత
దువ్వూరు	40,822	35,793	18,203	15,156	3,047 (టీడీపీ)
మైదుకూరు	64,323	54,621	32,346	19,358	12,988 (టీడీపీ)
చాపాడు	32,441	28,682	13,621	13,705	84 (వైఎస్సార్‌సీపీ)
ఖాజీపేట	42,650	34,914	16,659	16194	465 (టీడీపీ)
బీ.మఠం	31,619	25,775	13,599	10,106	3,499 (టీడీపీ)

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పుట్టాకు నాలుగు మండలాల్లో ఆధిక్యత లభించింది. గతంలో వరుసగా రెండు పర్యాయాలు పరాజయం పొందిన ఆయన ఈ సారి విజయం సాధించారు. మైదుకూరు నియోజకవర్గంలో 2,11,855 ఓట్లకుగాను 1,79,785 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పుట్టా సుధాకర్ యాదవ్‌కు 53.22 శాతంతో 96,181 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి 41.62 శాతంతో 75,231 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లతో కలుపుకొని పుట్టా సుధాకర్ యాదవ్ 20,950 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

కమలాపురంలో భారీ వర్షం


జలమయమైన మార్కెట్ వీధి

కమలాపురం : పట్టణంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. ఈదురు గాలులు వీచడంతో పాటు మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. బ్రాహ్మణవీధి, కృష్ణానగర్, వినాయక నగర్, మారుతినగర్, బీడీ కాలనీ తదితర కాలనీల్లో జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షం నీరు నిలవడంతో పాదాచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నాలుగు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలకు మంగళవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది.

6న వాహనాల వేలం

లక్కిరెడ్డిపల్లె : వివిధ కేసులలో పట్టుబడిన, ప్రభుత్వ పరమైన నాలుగు ద్విచక్ర వాహనాలైన హోండా యూబీ, హీరో హోండా స్పెండర్ ప్లస్, హీరో ప్యాషన్ ప్రో, టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100 వాహనాలను ఈనెల 6వ తేదీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, ఎస్ఈబీ అన్నమయ్య వారి ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలంపాట జరుపబడునని ఎస్ఈబీ సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. కావున ఆసక్తిగల వారు ఎస్ఈబీ స్టేషన్‌లో వాహనాలను తనిఖీ చేసుకొని ఎస్ఈబీ స్టేషన్‌లో రూ. 5 వేలు ఈఎండీ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

మైదుకూరులో బ్రేక్ అవుతున్న హ్యాట్రిక్‌లు


డీఎల్ రవీంద్రారెడ్డి


శెట్టిపల్లె రఘురామిరెడ్డి


పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు : మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల చరిత్రలో ఏ అభ్యర్థి వరుసగా రెండు సార్లకు మించి విజయం సాధించడం లేదు. మూడో పర్యాయం ప్రత్యర్థి విజయం సాధిస్తున్నారు. 1978లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన డీఎల్ రవీంద్రారెడ్డి గెలుపొందారు. ఆయన రెండో సారి కాంగ్రెస్ అభ్యర్థిగా 1983లో పోటీ చేసి తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలో కూడా విజయం సాధించారు. అయితే 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా అప్పటి ప్రొద్దుటూరు సమితి అధ్యక్షునిగా ఉన్న శెట్టిపల్లె రఘురామిరెడ్డి పోటీ చేసి డీఎల్ రవీంద్రారెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని అడ్డుకొని తొలిసారి శాసనసభ్యునిగా గెలుపొందారు. తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగానే డీఎల్ రవీంద్రారెడ్డి 1989, 1994లో వరుసగా విజయం సాధించారు. అయితే రెండు పర్యాయాల్లో ఓటమిపాలైన రఘురామిరెడ్డి.. డీఎల్ రవీంద్రారెడ్డి హ్యాట్రిక్‌ను బ్రేక్ చేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టి 2004, 2009 ఎన్నికల్లో అధికారంలోకి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. ఆ రెండు పర్యాయాల్లో డీఎల్ రవీంద్రారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగానే హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో.. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేయడం, రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడం వంటి పరిణామాలతో మైదుకూరు నియోజకవర్గంలో డీఎల్ రవీంద్రారెడ్డి 2014లో జరిగిన ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన శెట్టిపల్లె రఘురామిరెడ్డి 2014, 2019లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా విజయం సాధించి హ్యాట్రిక్ కోసం నిలిచారు. తాజా ఎన్నికల్లో ఆయన విజయాల హ్యాట్రిక్‌ను టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అడ్డుకుని ఎమ్మెల్యేగా గెలుపొందారు. డీఎల్ రవీంద్రారెడ్డి హ్యాట్రిక్ విజయాలు సాధించకుండా రఘురామిరెడ్డి రెండు సార్లు బ్రేక్ చేయగా, తొలి సారి హ్యాట్రిక్ కోసం నిలిచిన రఘురామిరెడ్డికి పుట్టా సుధాకర్ యాదవ్ హ్యాట్రిక్ సాధించే అవకాశాన్ని ఇవ్వలేదు.

రాజోలి ఆనకట్టకు జలకళ


రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నదిలోకి పోతున్న వర్షం నీరు

రాజుపాళెం : పైతట్టు ప్రాంతాలైన కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు గ్రామాల్లో కురిసిన వర్షం నీరు మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం ఆనకట్ట వర్షపు నీటితో జలకళ సంతరించుకుంది. గత నాలుగైదు రోజుల కిందట ఆనకట్టలో అడపాదడపా నీరు ఉండేది. ప్రస్తుతం నీరు భారీగా రావడంతో చల్లని వాతావరణం నెలకొంది.

భద్రత కట్టుదిట్టం.. అంతటా నిర్మానుష్యం

- ఎక్కడ చూసినా కర్ఫ్యూ వాతావరణం
- కౌంటింగ్ సందర్భంగా భారీ పోలీసు భద్రత


ప్రొద్దుటూరు శివాలయం సెంటర్‌లో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు


ప్రొద్దుటూరులోని మైదుకూరు రోడ్డులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


మైదుకూరులో మూతపడిన దుకాణాలు

ప్రొద్దుటూరు క్రైం : కౌంటింగ్ సందర్భంగా ప్రొద్దుటూరులో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు భారీ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లతోపాటు వీధుల్లో పోలీసులు మోహరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యగా పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. మంగళవారం వేకువజాము నుంచే పోలీసులు రోడ్లపైకి వచ్చారు. కడప కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే నాయకులకు కూడా ప్రత్యేకంగా పోలీసు ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. తిరిగి నాయకులు ఇళ్లకు వచ్చే వరకు ఎస్కార్ట్ కొనసాగింది.

దుకాణాలు మూసివేత

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రొద్దుటూరులో జన సంచారం లేకుండా వీధులు నిర్మానుష్యంగా కనిపించాయి. ఒక విధంగా చెప్పాలంటే ప్రొద్దుటూరులో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. పోలీసు అధికారుల హెచ్చరికల నేపథ్యంలో పట్టణంలోని దుకాణాలను మూసివేశారు. గ్రామీణ ప్రాంత వాసులు పట్టణానికి రావద్దని పోలీసులు రెండు రోజులు ముందే సూచన చేశారు. అత్యవసర పని ఉంటేనే రావాలన్నారు. ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు మీదుగా ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించాయి. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరిగిన పలు సంఘటనలను దృష్టిలో ఉంచుకొని వారం రోజుల ముందు నుంచే అన్ని పార్టీల నాయకులను పిలిపించి పోలీసు అధికారులు సమావేశాలు నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. గెలుపొందిన తర్వాత అభ్యర్థులు ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని, బాణా సంచా కాల్చరాదని డీఎస్పీ మురళీధర్ సూచనలు చేశారు. అలాగే ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారిని ప్రతి రోజు ఆయా పోలీస్‌స్టేషన్లకు పిలిపించి హెచ్చరించారు. కొందరిని జిల్లా బహిష్కరణ చేశారు. పలువురు ట్రబుల్ మాంగర్స్‌ను హౌస్ అరెస్ట్ చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

350 మందితో బందోబస్తు

పట్టణంలో సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

డీఎస్పీతో పాటు 8 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 63 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 170 మంది కానిస్టేబుళ్లు, 20 మంది ఏఆర్ సిబ్బంది, 70 మంది హోంగార్డులు బందోబస్తులో పాల్గొన్నారు. స్థానిక సీఐలు శ్రీకాంత్, రమణారెడ్డి, వెంకటరమణ, అబ్దుల్‌కరీం, యుగంధర్, శివశంకర్, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, హైమావతి, మంజునాథ్ పర్యవేక్షించారు.

144 సెక్షన్ అమలు

మైదుకూరు : అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం మైదుకూరులో పోలీసు బందోబస్తు కర్ఫ్యూను తలపించింది. సోమవారం రాత్రి నుంచే పట్టణంలోని అన్ని దుకాణాలను పోలీసులు మూసివేయించడంతో మంగళవారం మైదుకూరు పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలు చేయడంతో జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. డీఎస్పీ వెంకటేశులు ఆదేశాలతో అర్బన్ సీఐ మస్తాన్, ఎస్ఐలు, సిబ్బంది పట్టణంలోని ప్రధాన రహదారులపై నిరంతరం తిరుగుతూ జనం గుంపులుగా చేరకుండా చూశారు. అసెంబ్లీ ఫలితాలు తెలుస్తున్నా, జనాన్ని రోడ్లపైకి రాకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

8 నుంచి మండల దీక్ష : ఈనెల 8వ తేది నుంచి శ్రీ విజయదుర్గాలయంలో భక్తుల మండల దీక్ష ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు. జులై 21వ తేది వరకు ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారి మండల దీక్ష (మాలధారణ కార్యక్రమం) ఉంటుందన్నారు.